


# విభారె

తెలుగు దినపత్రిక


VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 09-09-2026 సంపుటి : 08 సంచిక 81 పేజీలు : 8 వెల : రూ 3-00


# నియోజకవర్గానికి రూ. కోటి



**25 ప్రాధాన్యాంశాల్ని గుర్తించాలి**

**స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి**

**2029 ఎన్నికలపైనే నా ధ్యాస, ఆలోచన**

**తెదేపా ప్రజాప్రతినిధులకు సీఎం చంద్రబాబు స్పష్టీకరణ**

అమరావతి: చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న సానుకూలతను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లుగా మార్చేందుకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా నేతలు సమిష్టిగా పనిచేయాలని స్పష్టంచేశారు. తెదేపా లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో సోమవారం ఆయన పార్టీ బలోపేతం, నియోజకవర్గాల అభివృద్ధిపై కీలక సూచనలు చేశారు. "నా ధ్యాస, ఆలోచన... 2029 ఎన్నికల్లో గెలుపుపైనే. 2024 కంటే మెరుగైన ఫలితాలు వస్తాయి. అందులో తిరుగులేదు" అని పేర్కొన్నారు. మూడు నెలలకోసారి ఇలాంటి లీడర్‌షిప్ కాంక్లేవ్‌లు నిర్వహిస్తామన్నారు.

ఎంపీలూ నిధులు కేటాయించాలి: డబ్బు ఒక్కటే ఎన్నికల్లో గెలిపించదని, ప్రజలు, కేడర్‌తో బలమైన అనుబంధమే విజయానికి పునాది అని సీఎం తెలిపారు. నియోజకవర్గాల్లో చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన కోరగా... నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున ఇచ్చేందుకు సీఎం అంగీకరించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీలు వారి పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యక్రమంలో నిధులు కేటాయించాలని తెలిపారు.ప్రతి నియోజకవర్గానికి 25 ప్రాధాన్యాంశాలు: ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో 25 ప్రాధాన్యాంశాలను గుర్తించి, వాటి ఆధారంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం సూచించారు. "అలా పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు, గౌరవం లభిస్తాయి. మీరు నిత్యం ప్రజల్లో ఉంటూ, కేడర్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి" అని సీఎం సూచించారు. 2029 ఎన్నికలపై ఇప్పటి నుంచే గురి: 2029 ఎన్నికల్లో విజయంపైనే తన ధ్యాస, ఆలోచన ఉన్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "ముందుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయభేరి మోగించి, ఆ తర్వాత వచ్చే సాధారణ ఎన్నికలకు బలమైన పునాది వేసుకోవాలి. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీకి సమర్థులైన మహిళా నాయకులను గుర్తించాలి" అని సూచించారు.

విజన్ ప్లాన్ అమలుచేస్తే గెలుపు ఖాయం: స్వర్ణాంధ్ర విజన్-2047పై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు వ్యాల్యూ యాడిషన్ చేయాలన్నారు. విజన్ ప్లాన్ అమలుచేస్తే అభివృద్ధి కాకుండా, ఎన్నికల్లో గెలుపూ సాధ్యమవుతుందని తెలిపారు. కేంద్రమంత్రులుగా ఒక శాఖను పర్యవేక్షిస్తున్నవారు అదే స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి చేయాలని సూచించారు.??గ "రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలని, దుష్ప్రచారంతో అందరి దృష్టి మళ్లించాలని.. పెట్టుబడులు రాకుండా చేయాలని.. ఎవరైనా ముందుకొస్తే బెదిరించాలనేదే వైకాపా ఉద్దేశం. వీటన్నింటినీ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. అప్పుడు వైకాపా నేతలు చరిత్రహీనులుగా మిగులుతారు."

## హస్తకళలను గ్లోబల్ మార్కెట్లకు అనుసంధానించేలా చర్యలు: పవన్ కల్యాణ్



అమరావతి, సెప్టెంబర్ 8 : హస్తకళాకారుల అభివృద్ధికి కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు వేగంగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం సీతంపేటలో సవర కళాకారుల సెంటర్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.వీబీ-జీ రామ్ జీ నిధులతో సవర కళాకారుల సెంటర్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మదనపల్లి, అనంతపురం, పెడనల్లో సెంటర్ల కోసం స్థలాల గుర్తింపు పూర్తి చేశామని చెప్పుకొచ్చారు. త్వరలో మదనపల్లి, అనంతపురం, పెడనల్లో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్ అభివృద్ధికి రూ.12 లక్షలు కేటాయించినట్లు పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఏటికొప్పాక ఆరోగ్య కేంద్రం పనులు పునఃప్రారంభిస్తామని చెప్పారు. హస్తకళాకారుల సంక్షేమానికి మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించామని అన్నారు. హస్తకళా ఉత్పత్తులపై క్యూఆర్ కోడ్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశామని తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కళాకారుడి వివరాలు, శ్రమకు సంబంధించిన సమాచారం అందిస్తామని అన్నారు.హస్తకళలను గ్లోబల్ మార్కెట్లకు అనుసంధానించేలా చర్యలు చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరు ఉచిత నేత్ర వైద్య శిబిరాల్లో 1,708 మందికి పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. సుమారు 93 మందికి ఉచితంగా శుక్లాల ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. 1,253 మందికి పైగా ఉచిత కళ్లద్దాల పంపిణీకి ఏర్పాట్లు చేశామని అన్నారు. హస్తకళాకారులు పస్తులు ఉండకూడదని.. పనికి ఆటంకం కలగకూడదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## కిలో ఉల్లిపాయలు రూ.32కే.. వచ్చే వారం నుంచే: మంత్రి నాదెండ్ల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏపీలో కిలో ఉల్లిపాయలు రూ.32కే సర్కార్ అందించనున్నట్లు తెలిపారు. వచ్చే వారం నుంచి 115 రైతు బజార్లలో ఉల్లిపాయలను విక్రయించనున్నట్లు చెప్పారు. మొబైల్ కౌంటర్ల ద్వారా కూడా ఉల్లిపాయలు సరఫరా చేస్తామన్నారు. రేషన్‌తో కిలో కందిపప్పును సబ్సిడీపై ప్రభుత్వం అందించనుందని తెలిపారు. మార్కెట్ ధర కంటే 25-30శాతం తక్కువకు కందిపప్పు విక్రయిస్తామన్నారు. 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కంది సేకరణకు కేంద్రం సహకారం అందించనున్నట్లు వెల్లడించారునాలుగు నుంచి ఐదు నెలల పాటు కందిపప్పును పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. పామాయిల్ ధరల నియంత్రణకూ కేంద్రంతో చర్చలు జరుపుతామని చెప్పారు. పీడీఎస్ బియ్యంలో 25శాతం నూకల స్థానంలో 10శాతం నూకలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏపీ పైలట్‌ను కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేయనుందన్నారు. అక్టోబర్ 1 నాటికి వెయ్యి 'మీ మార్ట్' దుకాణాలు ప్రారంభిస్తామని.. ఇప్పటికే 870 'మీ మార్ట్' దుకాణాలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. 64 రకాల నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు మీ మార్ట్ దుకాణాల ద్వారా అమ్మకాలు చేయనున్నట్లు తెలిపారు. 100, 250, 500 గ్రాముల చిన్న ప్యాకెట్లలో సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు.రైతులకు 24 గంటల్లోనే ధాన్యం చెల్లింపులు కొనసాగుతాయని నాదెండ్ల వెల్లడించారు. 37-38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉందన్నారు. పీడీఎస్‌లో పంచదార, పచ్చిశనగల పంపిణీ యథావిధి కొనసాగుతుందన్నారు. త్వరలో రేషన్‌తో పామాయిల్ సరఫరా చేయడమే లక్ష్యమని తెలిపారు. ఎల్‌పీజీ రీబుకింగ్‌కు 25 రోజుల గ్యాప్ అమల్లోకి రానుందన్నారు. విజయసాయి రాజకీయ పార్టీని మంత్రి స్వాగతించారు. ఎవరైనా పార్టీ పెట్టొచ్చన్నారు. విజయసాయిరెడ్డి రాజకీయ ప్రవేశానికి స్వాగతం పలికారు. కాగా.. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ కోపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేని మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు.



# అంతిమ విజయం సత్యానిదే: ప్రధాని మోదీ




అసత్యాల ప్రతిధ్వనిని సత్యం జయిస్తుందని ప్రధాని మోదీ తాజాగా వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. అసత్యాల ప్రతిధ్వనుల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కానీ భారత దేశ యువత మాత్రం సత్యమార్గంలో ప్రయాణిస్తోందని చెప్పారు. తప్పుదారి పట్టించే వారు ప్రతి చోటా తారసపడుతూనే ఉంటారని అన్నారు. అంతకుముందు ప్రధాని వడోదరలో రూ.20 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సభకు పెద్ద ఎత్తున హాజరైన గుజరాత్ యువతను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'ఇటీవలే వడోదర, ముంబై మధ్య డబుల్ డెకర్ గూడ్స్ రైలు ప్రారంభమైంది. ఈ రైలు ద్వారా ఒక్క ట్రిప్‌లో 250 ట్రక్కులకు సమానమైన సరకును తరలించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కూడా కొందరు ఎంట్రీ ఇచ్చి విమర్శలు గుప్పిస్తారు. ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తారు. ట్రక్కుల పరిస్థితి ఏమిటని అంటారు. వాళ్లకు గొణిగేందుకు మరో అంశం దొరికినట్టే' అని ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. 2014కు ముందు సరకు రవాణా ప్రత్యేక కారిడార్ నిర్మాణం కిలోమీటరు మేర కూడా ముందుకు సాగలేదని విమర్శించారు.

## పరువునష్టం కేసులో రాహుల్‌కు ఎదురుదెబ్బ..

**పిటిషన్ కొట్టివేసిన బాంబే కోర్టు**

న్యూఢిల్లీ ప్రధాని మోదీపై అనుచిత వాఖ్యలు చేశారన్న ఆరోపణలతో నమోదైన పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి ఎదురుదెబ్బ తగిలింది. పరువునష్టం కేసును కొట్టివేయాలంటూ రాహుల్ వేసిన పిటిషన్‌ను బాంబే హై కోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన విచారణ యథావిధిగా కొనసాగనుంది. రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందానికి సంబంధించిన వివాదం నేపథ్యంలో ప్రధానిని రాహుల్‌గాంధీ .. 'కమాండర్ ఇన్ థీఫ్' అని పేర్కొంటూ సోషల్‌మీడియాలో, సభలలో వ్యాఖ్యానించారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ కార్యకర్త మహేష్ శ్రీమల్ పరువునష్టం కింద బాంబే హైకోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. దీంతో పరువు నష్టం కేసులో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను బాంబే హైకోర్టు కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.






# సంపాదకీయం

బుధవారం 09-09-2026

## జటిలమైన రాజకీయ భవిష్యత్తు!

ఏదీ తెగేదాకా లాగొద్దనేది పెద్దల వాదన. సమస్యను చిన్నదిగా ఉన్నప్పుడే సామరస్యంగా పరిష్కరించుకుంటే అన్ని సర్దుకుంటాయి. కానీ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం పెద్ద చర్చగా మారింది. మంత్రి పదవిలో ఉన్న సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ నుంచి తప్పించారు. గవర్నర్ కూడా దీనికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత కొండా సురేఖ శాఖలు సీఎం దగ్గరకు చేరాయి. విమర్శలు, వివరణలు, రిపోర్టుల తర్జనభర్జన తర్వాత.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎండ్ కార్డ్ పడింది.. దీంతో ఒక్కసారిగా కొండా కుటుంబం రాజకీయ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. ఈ గొడవ ఒక్కరోజులో మొదలైంది కాదు. కొండా సురేఖ కూతురు సుష్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడంతో అసలు గొడవ మొదలైంది. ముఖ్యంగా పరకాల సీటు విషయంలోనే కొండా కుటుంబానికి, రేవంత్‌రెడ్డి వర్గానికి మధ్య దూరం పెరిగిందనే చర్చ ఉంది. పరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం కూతురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు. కూతురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరించారు. పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా రాజకీయ పరిచయాలు ఉన్నాయి. అదే సమయంలో రేవంత్‌రెడ్డి అక్కడ తనకు నమ్మకమైన నాయకులను ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఇద్దరి దారులు వేర్వేరుగా కనిపించడంతో దూరం పెరిగిందనే మాట వినిపిస్తోంది. సురేఖ కూడా తనను ప్రభుత్వం పక్కన పెడుతోందని గతంలో కొన్ని సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారనే వార్తలు వచ్చాయి. అందుకే కూతురు చేసిన వ్యాఖ్యలు ఒక్కటే కారణం కాదని, ముందే కొంత దూరం పెరిగి ఉండొచ్చని రాజకీయంగా చర్చ జరుగుతోంది. అయితే ఇది రాజకీయ అంచనా మాత్రమే. కొండా సురేఖ కూడా మౌనంగా ఉండలేదు. తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులపై కూడా ఆమె ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ సురేఖ చేసిన ఆరోపణలే. వాటిని నిజమని నిర్ధారించే ఆధారాలు బయటకు రాలేదు. కాంగ్రెస్ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు వెళ్లింది. దీంతో మంత్రి పదవి పోయింది. ఇక్కడే అసలు రాజకీయం కనిపిస్తోంది. ఇది కేవలం ఒక మంత్రి పదవి పోయిన వ్యవహారం మాత్రమే కాదు. పార్టీలో ఎవరికి ఎంత బలం ఉంది, ఎవరితో ఎవరు కలిసి నడుస్తున్నారు, వచ్చే ఎన్నికల నాటికి ఎవరి మాట ఎంత వరకు చెల్లుతుంది అన్న లెక్కలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలు కూడా కలకలం రేపాయి. డబ్బుల పంపకానికి సంబంధించిన గొడవ వల్లే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆయన ఆరోపించారు. అవినీతి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన అన్నారు. అయితే రాజాసింగ్ చెప్పింది ఆరోపణ మాత్రమే. దానికి ఇప్పటివరకు బలమైన ఆధారం బయటకు రాలేదు. సురేఖ కూడా తనపై అలాంటి ఆరోపణలు లేవని చెబుతున్నారు. కాబట్టి ఈ మాటలను రాజకీయ ఆరోపణలుగానే చూడాలి. సురేఖను తప్పించిన తర్వాత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు. ఈ మార్పులను కొందరు రాజకీయంగా చూస్తున్నారు. బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఏర్పడే ప్రభావాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంగా కొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇదే కారణంతో ఈ నియామకాలు చేసిందని అధికారికంగా చెప్పలేదు.తెలంగాణలో మంత్రి పదవిలో ఉండగానే బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భాలు గతంలోను ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో 2015లో తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత 2021లో ఈటల రాజేందర్‌ను కూడా కేబినెట్ నుంచి తొలగించారు. ఈటలపై భూముల విషయంలో ఆరోపణలు రావడంతో ఆయన శాఖను తీసుకుని, ఆ తర్వాత కేబినెట్ నుంచి బయటకు పంపారు. ఈ ఆరోపణలను ఈటల ఖండించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కూడా ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం కూడా అదే వరుసలో మరో రాజకీయ ఘటనగా మారింది. అయితే మూడు ఘటనలకు మూడు వేర్వేరు కారణాలు ఉన్నాయి. అందుకే వాటిని ఒకే గాటన కట్టడం సరికాదు.మంత్రి పదవి పోయిందంటే కొండా కుటుంబం రాజకీయంగా అయిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది. అందుకే ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తర్వాత ఏం చేస్తుందనే దానిపైనే ఉంది. కాంగ్రెస్‌లోనే ఉండి ముందుకు వెళ్తారా, కొంతకాలం మౌనంగా ఉంటారా, లేక మరో దారి చూసుకుంటారా అన్నది కాలమే చెప్పాలి. మొత్తానికి కూతురు చేసిన వ్యాఖ్యలతో మొదలైన గొడవ, పరకాల సీటు దగ్గర పెరిగిన దూరం, పార్టీలో పెరిగిన గ్యాప్, చివరకు మంత్రి పదవి పోయే వరకు వెళ్లింది. కానీ ఇంతటితో కొండా సురేఖ రాజకీయ కథ ముగియలేదు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులపై కొత్తగూడెంలో భారీ ప్రదర్శన

### అంబేద్కర్ విగ్రహానికి వినతి

### కాంగ్రెస్ కు రోజులు దగ్గర పడ్డాయి : రాకేష్ రెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 08 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నాయకులు నల్ల చొక్కాలతో భారీ నిరసన ప్రదర్శన చేశారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆదేశాలతో పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి సూపర్ బజార్ సెంటర్ వరకు నల్ల చొక్కాలతో భారీ నిరసన ర్యాలీ చేశారు. వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన.. డౌన్ డౌన్ సీఎం.. డౌన్ డౌన్ రేవంత్ రెడ్డి.. ఖబడ్దార్ రేవంత్ అంటూ నినాదాలు చేస్తూ మహిళలు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇది గౌరవమైన సభ కాదని కౌరవుల సభలా ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేసి దౌర్జన్యానికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్ కే దక్కిందన్నారు.వందేళ్ల చరిత్రని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి వచ్చి నాలుగు ముక్కలు చేశాడని ఇప్పుడు బీఆర్ఎస్ వైపు జనం ఉండడంతో రేవంత్‌కు ఏం చేయాలో అర్థం కాక వెర్రి వేషాలు వేస్తున్నాడన్నారు. 14 ఏళ్ల పోరాటంతో సాధించిన తెలంగాణను తెచ్చుకున్న కేసీఆర్ పై సీఎం రేవంత్ తప్పుడు మాటలు మాట్లాడుతూ పిచ్చి వేషాలు వేస్తున్నాడని మండిపడ్డారు. వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. రేవంత్ రెడ్డి మాయ మరాఠీలా మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని, ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయాడన్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ను నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నాడని, దానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ ప్రదర్శనలో కొత్తగూడెం కార్పొరేషన్ కార్పొరేటర్లు సింధు తపస్వి, మధుచంద్, వీరమ్మ, సాగర్, గుణ చరిత. రాంబాబు. భీమా శ్రీధర్. అనుదీప్. కొట్టి వెంకటేశ్వర్లు. శ్రీరామ్మూర్తి, విశ్వనాదం. మంతపురి రాజు గౌడ్, బాధవత్ శాంతి, సోనా హుస్సేన్, నవతన్. జగన్, మదాసి పద్మ, బట్టు మంజుల, వేమూరి శివ, అంబుల వేణుగోపాల్, డీకొండ సునీత, శ్రీకాంత్ పాల్గొన్నారు




# బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి దారుణం

### మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ తీవ్ర ఆగ్రహం

హుస్నాబాద్ తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి భారీ నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రస్తుత మరియు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళా నాయకులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తుంటే వారిని పోలీసులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు శ్రీ వొడితల సతీష్ కుమార్ తీవ్రంగా ఖండించారు.ముఖ్యంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా పోలీసులు దురుసుగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని అన్నారు.అసెంబ్లీ సాక్షిగా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ప్రవర్తన జరగడం తెలంగాణ సమాజం సిగ్గుపడే విషయం. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒకవైపు మహిళా సాధికారత గురించి మాట్లాడుతూనే మరోవైపు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులతో ఇలా వ్యవహరించడం ఏ విధమైన మహిళా గౌరవం? అని సతీష్ కుమార్ ప్రశ్నించారు.మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు ప్రతి మహిళా సమాజం స్పందించాలి:మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటన కేవలం బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన విషయం కాదని, ప్రజాస్వామ్యాన్ని, మహిళా గౌరవాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అంశమని సతీష్ కుమార్ అన్నారు.ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ప్రజాప్రతినిధులకే రక్షణ, గౌరవం లేకపోతే రాష్ట్రంలోని సామాన్య మహిళలకు ఈ ప్రభుత్వం ఏ విధంగా భరోసా కల్పిస్తుందని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని అడ్డుకోవడం ద్వారా మహిళల గొంతుకను కూడా అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు.సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు ప్రజల్లోకి బీఆర్ఎస్ పోరుబాటకాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టామని సతీష్ కుమార్ తెలిపారు.నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు.హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన భారీ ధర్నా అనంతరం చేపట్టిన నిరసన ర్యాలీలో మహిళలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

# కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్ రెడ్డి-హరీష్ రావు

హైదరాబాద్,సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి యావత్ మహిళా లోకాన్ని అవమానించారు. ఇది గౌరవ సభ కాదు 'కౌరవ సభ'.. రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడు. దాడికి గురైన మహిళా ఎమ్మెల్యేలపైనే రివర్స్లో కేసులు పెడతారా? ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లుగా తయారైంది పోలీసుల తీరని మాజీ మంత్రి హరీ?ష్ రావు అరోపించారు.స్పీకర్ పట్ల మాకు పూర్తి గౌరవం ఉంది.. మా సభ్యుడు క్షమాపణ చెప్పినా కూడా అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఒకే తప్పుకు ఎన్ని శిక్షలు వేస్తారో మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం. దళితులపై కాంగ్రెస్కు నిజంగా ప్రేమ ఉంటే.. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఏమైంది? అంబేద్కర్ విగ్రహానికి తాళాలు ఎందుకు వేశారని ప్రశ్నించారు.మాట్లాడే అవకాశం ఇచ్చిన స్పీకర్ కి ముందుగా ధన్యవాదాలు. మహిళా శాసనసభ్యుల మీద జరిగిన దాడిని పోలీసులు పరిశీలిస్తారని మంత్రి శ్రీధర్ బాబు గారు చెప్పడం విడ్డూరంగా ఉంది. శ్రీధర్ బాబు కి కూడా అక్కాచెల్లెళ్లు ఉన్నారు.. సొంత అక్కాచెల్లెళ్ల మీద ఇలాంటి దారుణమైన దాడి జరిగితే కేవలం పరిశీలిస్తాం అని సరిపెట్టుకుంటారా. ఆయన నుంచి కనీస సానుభూతి, విచారం ఆశించాం కానీ అది జరగలేదు. మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి పై మగ పోలీసులు దాడి చేశారు, ఆమె గొంతు పిసికారు.. ఇదంతా వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. మరో మాజీ మంత్రి, మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి రి చీర లాగడంతో ఆమె కన్నీరు పెట్టుకున్న దృశ్యాలను మనమంతా చూశాం. ఇంత దారుణం జరిగినా ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరగలేదు. సీపీకి, పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇస్తే.. న్యాయం చేయాల్సింది పోయి, దాడికి గురైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి గారి మీదే రివర్స్లో కేసులు నమోదు చేశారు. ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లుగా తయారైంది పోలీసుల తీరు. ఇది కేవలం బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి కాదు, రాష్ట్రంలోని యావత్ మహిళా లోకంపై జరిగిన దాడి. వాళ్లను తీవ్రంగా కించపరిచారు. ఇదెక్కడి పద్ధతి స్పీకర్ గారు. మీరే మమ్మల్ని కాపాడాలి, మీరే మా రెస్క్యూకి రావాలి. ఈ అసెంబ్లీ ఇప్పుడు గౌరవ సభ కాదు, కౌరవ సభగా మారిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడిలా మారారు. ఆనాడు మహాభారతంలో కౌరవులకు పట్టిన గతే, ఈరోజు కాంగ్రెస్ పార్టీకి కూడా పడుతుంది. స్పీకర్ గారు, మీరంటే మాకు ఎంతో గౌరవం. వ్యక్తిగతంగా మీ పట్ల మాకు ఉన్న గౌరవాభిమానాలు ఎంతటివో మీ మనసుకు కూడా తెలుసు. నిన్న జరిగిన ఘటనలో మా సభ్యుడు తాతా మధు ఆ మాటలను స్పీకర్ ని ఉద్దేశించి అనలేదని స్పష్టం చేశారు. ఒకవేళ అలా భావించి ఉంటే ఆ పదాలను విత్డ్రా చేసుకుంటున్నానని, విచారం వ్యక్తం చేస్తున్నానని లిఖితపూర్వకంగా మీడియా ముఖంగా క్షమాపణలు కూడా చెప్పారు. మీరంటే మాకు ఎనలేని అభిమానం. మీరు నొచ్చుకుని ఉంటే పార్టీ తరఫున మేం కూడా విచారం వ్యక్తం చేస్తున్నాం. సభ్యుడు సారీ చెప్పినా, విచారం వ్యక్తం చేసినా.. కక్షపూరితంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఒక తప్పుకు ఎన్ని శిక్షలు వేస్తారో వేయండి, అది మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.

# హిందీ జాతీయ భాష.. శివ రాజ్‌కుమార్ వ్యాఖ్యపై సోషల్ మీడియాలో దుమారం..

కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ హిందీ గురించిన చేసిన ఓ వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. తన తాజా చిత్రం 'ఒరిజినల్ మాన్‌స్టర్' కార్యక్రమంలో హిందీని జాతీయ భాషగా పేర్కొనడం వివాదానికి కారణమైంది. పలువురు నెటిజన్లు ఆయనపై విమర్శలు చేస్తున్నారు. మరికొందరు మాత్రం శివ రాజ్‌కుమార్ ఉద్దేశాన్ని సమర్థిస్తున్నారు ఆర్. చంద్రు దర్శకత్వంలో తెరకెక్కుతున్న'ఒరిజినల్ మాన్‌స్టర్' చిత్రం కన్నడ, హిందీ భాషల్లో రూపొందుతోంది. ఈ సినిమా ద్వారా శివ రాజ్‌కుమార్ హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో హిందీ డైలాగులు చెప్పడం గురించి ఆయనను ప్రశ్నించగా.. హిందీ తనకు రెండో భాష అని చెప్పారు. తాను హిందీ మాట్లాడగలనని, అది సులభమైన భాష అని పేర్కొన్నారు. ప్రేక్షకులను కలిపేందుకు ఉపయోగపడే 'జాతీయ భాష'గా హిందీని అభివర్ణించారు హిందీ గురించి శివరాజ్ కుమార్ చేసిన ఈ వ్యాఖ్యలే ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు కారణమయ్యాయి శివ రాజ్‌కుమార్ వ్యాఖ్యలపై కొందరు నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందీని 'జాతీయ భాష'గా పేర్కొనడాన్ని ప్రశ్నించారు. ఆయన తండ్రి, దిగ్గజ నటుడు రాజ్‌కుమార్ ఇలాంటి వ్యాఖ్యలను అంగీకరించేవారు కాదంటూ ఓ నెటిజన్ కామెంట్ చేశారు. కొందరు మాత్రం శివరాజ్‌కుమార్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు.




# రీల్స్‌కు బానిసగా మారి.. ఇంటర్‌నెట్ లేదని మహిళ ఆత్మహత్య..



రీల్స్ చూడ్డానికి బానిసైన ఓ మహిళ మొబైల్‌లో ఇంటర్‌నెట్ సరిగా రావటం లేదని తీవ్ర మనోవేదనకు గురైంది. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోర్బా జిల్లా, కేరాకచ్చర్ గ్రామానికి చెందిన మంగ్లో బాయ్ సారధి అనే మహిళ రీల్స్ చూడ్డానికి బానిసైంది. ప్రతీరోజు గంటలు, గంటలు రీల్స్ చూస్తూ గడిపేది. శనివారం రీల్స్ చూస్తున్న సమయంలో ఇంటర్‌నెట్ సమస్య తలెత్తింది. రీల్స్ ఎక్కువ సేపు బఫర్ అవ్వసాగాయి.దీంతో అసహనానికి గురైన సారధి తన మొబైల్ ఫోన్‌ను విసిరి కొట్టింది. ఆ తర్వాత పురుగుల మందు తాగింది. సారధి కూతురు ఇది గమనించి కుటుంబసభ్యులకు చెప్పింది. వారు సారధిని కర్తాలా ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడినుంచి ఆమెను కోర్బా మెడికల్ కాలేజ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం సారధి కన్నుమూసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అందజేశారు.

# టీచర్ల నియామకాలపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు.. అర్హతలేనివారికి నో ఎంట్రీ

ఢిల్లీ, సెప్టెంబర్ 8: దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యావ్యవస్థలో నాణ్యతను కాపాడేందుకు అర్హత లేని వ్యక్తులను టీచర్లుగా నియమించకూడదని స్పష్టం చేసింది. ఖీఇ, ఔఉఇ, జఉఅ నిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని కొత్తగా నియమించడం మాత్రమే కాకుండా.. ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కొనసాగించడానికి వీల్లేదని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల నియామకాల్లో విద్యార్థుల ప్రయోజనాలు, బోధనా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది.ప్రభుత్వ సర్వీసుల్లోకి ఉపాధ్యాయులను విలీనం చేసే పేరుతో పారదర్శకమైన, పోటీతత్వ నియామక ప్రక్రియను పక్కన పెట్టడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎలాంటి పారదర్శక నియామక ప్రక్రియ లేకుండా.. అర్హతలు లేని వ్యక్తులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకోవడాన్ని అంగీకరించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఖీఇ, ఔఉఇ, జఉఅ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నవారినే ఉపాధ్యాయులుగా నియమించాలని పేర్కొంది. అర్హత ప్రమాణాలను పాటించకుండా నియామకాలు చేపడితే విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. దీంతో టీచర్ల నియామకాల్లో ఇకపై నిబంధనలు, పారదర్శకత, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# సింహపురిలో రియల్ జోరు

నెల్లూరు, సెప్టెంబర్ 8,నెల్లూరు నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొత్త దారిలో వెళ్తోంది. నగర పరిధిలోని కీలకమైన మినీ బైపాస్ రోడ్డు, కృష్ణపట్నం పోర్ట్ కనెక్టివిటీ రహదారుల పొడవునా సెమీ–లగ్జరీ అపార్ట్‌మెంట్లు, ఆధునిక కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు భారీగా పుంజుకున్నాయి. జాతీయ రహదారి కి, పోర్ట్ రవాణా కారిడార్‌కు అనుసంధానంగా ఉన్న ఈ ప్రాంతాలు నివాస , వ్యాపార అవసరాలకు అనువుగా మారడంతో డెవలపర్లు సరికొత్త ప్రాజెక్టులతో ముందుకు వస్తున్నారు.కృష్ణపట్నం పోర్ట్ ఆధారిత లాజిస్టిక్స్, షిప్పింగ్ సంస్థలు, మైనింగ్ , మల్టీ–మోడల్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలు శరవేగంగా విస్తరిస్తుండటంతో నెల్లూరు నగరంలో ఆయా కంపెనీల అధికారులు, ఇంజనీర్ల నివాస అవసరాలు పెరిగాయి. దీనికి తోడు మెరుగైన అద్దె ఆదాయం వస్తుండటంతో విదేశాల్లో ఉండే నెల్లూరు జిల్లావాసులు తమ పెట్టుబడులను మినీ బైపాస్ పరిసరాల్లోని సెమీ–లగ్జరీ ఫ్లాట్లు, కమర్షియల్ ప్రాపర్టీలపై కేంద్రీకరిస్తున్నారు. సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావిస్తూ ముందస్తుగానే అపార్ట్‌మెంట్లను బుక్ చేసుకుంటున్నారు.మినీ బైపాస్ పరిసర ప్రాంతాలు నగరంలోని ప్రధాన ఆసుపత్రులు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్‌కు సమీపంలో ఉండటం కూడా కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో కేవలం ఇండిపెండెంట్ ఇళ్లకు ప్రాధాన్యత ఇచ్చిన స్థానికులు, ఇప్పుడు సెక్యూరిటీ, పవర్ బ్యాకప్, జిమ్, కార్ పార్కింగ్ వంటి వసతులు ఉండే గేటెడ్ కమ్యూనిటీల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల ఇక్కడ చదరపు అడుగు ధర రూ. 4,000 నుంచి రూ. 6,000 వరకు పలుకుతోంది.పరిశ్రమల అభివృద్ధి, పోర్ట్ ఆధారిత వ్యాపారాల విస్తరణతో నెల్లూరు నగరం దక్షిణ కోస్తాలో కీలకమైన లాజిస్టిక్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. పొట్టి శ్రీరాములు నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ ఆమోదిత ప్రాజెక్టులకు డిమాండ్ నిరంతరం పెరుగుతుండటంతో, రాబోయే రోజుల్లో మినీ బైపాస్ మరియు పోర్ట్ రోడ్డు కారిడార్లలో ఆస్తుల విలువలు మరింత పెరిగే అవకాశం ఉందని రియల్టీ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# రెండేళ్ల పాలనకు రెఫరెండమేనా

విజయవాడ, సెప్టెంబర్ 8,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు శరవేగంగా సాగుతుండటంతో, ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం సాధించిన రెండేళ్ల పాలనకు రెఫరెండం అవుతాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సర్వే ఏజెన్సీలు ఇచ్చే ప్రైవేటు సర్వేలు, ఒపీనియన్ పోల్స్ ఎన్ని వచ్చినా.. గ్రామ , నగర స్థాయిలో ఓటర్లు నేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకునే ఈ ఎన్నికలే అసలైన ప్రజాభిప్రాయానికి నిలువెత్తు అద్దమని నమ్మడంలో సందేహం లేదు. అయితే, ఈ ఎన్నికలను బహిరంగంగా రెఫరెండం గా అంగీకరించేందుకు రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార పక్షం ముందుకు వస్తుందా లేదా అనేది అసలైన ప్రశ్న.సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను తమ ప్రభుత్వ పాలనపై రెఫరెండం అని అధికారికంగా ప్రకటించడానికి ఇష్టపడవు. స్థానిక ఎన్నికల్లో కేవలం రాష్ట్రస్థాయి విధానాలు లేదా సంక్షేమ పథకాలే కాకుండా, స్థానిక అభ్యర్థి ఇమేజ్, కుల సమీకరణాలు, వ్యక్తిగత సంబంధాలు, ధనప్రవాహం వంటి అనేక హైపర్–లోకల్ అంశాలు ప్రభావం చూపుతాయి. ప్రభుత్వంపై ఎంత పాజిటివ్ వేవ్ ఉన్నప్పటికీ, స్థానికంగా ఎంపీటీసీ, సర్పంచ్ , కార్పొరేటర్ అభ్యర్థులపై ఉండే అసంతృప్తి వల్ల కూడా కొన్ని స్థానాలు చేజారే ప్రమాదం ఉంటుంది. అందుకే, అధికార కూటమి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, దీనికి రెఫరెండం ముద్ర వేసి అనవసర రాజకీయ ప్రమాదాన్ని కొనితెచ్చుకోదు.మరోవైపు, ప్రైవేటు సర్వేల ను పక్కన పెడితే.. స్థానిక పోరులో వచ్చే ఫలితాలే అసలైన గ్రౌండ్ రియాలిటీని సూచిస్తాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సంచలనాత్మక తీర్పు తర్వాత, కూటమి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు , అమరావతి అభివృద్ధి వంటి పరిణామాలు ప్రజల్లో ఎంతవరకు సానుకూలతను నింపాయో ఈ ఎన్నికల ద్వారా స్పష్టమవుతుంది. గ్రామీణ ,పట్టణ ఓటర్లు కూటమి పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అనేది బ్యాలెట్ బాక్సుల ద్వారా నిరూపితమవుతుంది. ఇక ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ ఈ రెఫరెండం వాదనను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకోవడానికి




ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు, హామీల నెరవేర్పులో జరుగుతున్న జాప్యానికి ఈ ఎన్నికలే కొలమానం అని ప్రచారం చేయడం ద్వారా ఓటర్లను తమవైపు తిప్పుకోవచ్చని భావిస్తోంది. అయితే, జగన్ పార్టీ నిజంగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అధికార పార్టీకి కౌంటర్ ఇవ్వాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతీ స్థానంలోనూ గట్టి పోటీని ఇచ్చి ఓటర్లలో నమ్మకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఇక అధికారంలో ఉన్న టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పరంగా చూస్తే, ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, మిత్రపక్షాల మధ్య సమన్వయం ఎంతవరకు బలపడిందో తేల్చే వేదికగా మారనున్నాయి. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల స్థాయిలో టిక్కెట్ల కేటాయింపులో పార్టీల మధ్య ఘర్షణలు రాకుండా చూసుకోవడం కూటమి పెద్దలకు సవాలుగా మారనుంది.కూటమి నేతలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిపి భారీ విజయాన్ని సాధిస్తే, అది వైఎస్ఆర్‌సీపీ నైతిక ధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కూటమి పాలనకు ప్రజల ఆమోదముద్ర పడినట్లే అవుతుంది. సాంకేతికంగా లేదా అధికారికంగా ఏ పార్టీ కూడా ఈ స్థానిక పోరును పాలనా రెఫరెండం అని ఒప్పుకోకపోయినా, రాజకీయ విశ్లేషకుల దృష్టిలో మరియు ప్రజల ఆలోచనల్లో ఇది కచ్చితంగా కూటమి ప్రభుత్వ పనితీరుకు వేసే గ్రేడింగ్ మార్కులే. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు స్పష్టమైన పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను, మూడ్‌ను నిర్దేశిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు

# విజయసాయిరెడ్డి సస్పెన్స్



విజయవాడ, సెప్టెంబర్ 8 విజయసాయిరెడ్డి.. దసరా దాకా సస్పెన్స్ థ్రిల్లర్.. అప్పుడే రిలీజ్..చెప్పిన సమయానికి.. అనుకున్న వేదిక వద్దకు విజయసాయిరెడ్డి వచ్చారు. కొద్దిరోజులుగా ఆయన సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులకు తగ్గట్టుగానే.. సుదీర్ఘంగా మాట్లాడారు. వచ్చిన విలేకరులకు తాగడానికి అల్లం టీ.. స్నాక్స్.. మంచి భోజనం పెట్టారు. కానీ.. తన స్క్రిప్ట్ ప్రకారం సస్పెన్స్ థ్రిల్లర్ కొనసాగించారు.సుదీర్ఘంగా మాట్లాడిన విజయసాయిరెడ్డి పార్టీ గురించి ఎటువంటి ప్రకటన చేయలేదు. కాకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇప్పటివరకు రెడ్లు.. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే పరిపాలించారని చెప్పారు. అంతేకాదు, తాను ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీలో సింహభాగం స్థానాలు జన్ జెడ్ కు కేటాయిస్తామని చెప్పారు. అక్కడితోనే ఆగిపోలేదు.. దసరాకు తాను ఏర్పాటు చేయబోయే పార్టీ గురించి ప్రకటిస్తానని విజయసాయిరెడ్డి వెల్లడించారు. అంతేకాదు.. తాను ఏర్పాటు చేయబోయే పార్టీ అధికారంలోకి గనుక వస్తే.. తాను ముఖ్యమంత్రి పదవి తీసుకోనని.. మహారాష్ట్రలో శివసేన అధినేత బాల్ థాక్రే మాదిరిగా పాత్ర పోషిస్తానని చెప్పుకొచ్చారు.విజయసాయిరెడ్డి జగన్ నుంచి దూరం జరిగిన తర్వాత ప్రజాస్వామ్య యుతంగా మాట్లాడుతున్నారు. గడిచిన ఏడాదికాలంగా ఆయన పరిశోధన చేశారట. కాపు కులం నుంచి రెడ్లు ఏ విధంగా వేరుపడ్డారు.. దానికి దారి తీసిన పరిస్థితుల గురించి ఒక పుస్తకాన్ని రాశారట. ఏపీ రాష్ట్రాన్ని ఇప్పటివరకు రెడ్లు.. కమ్మ సామాజిక వర్గాలకు చెందిన వారు మాత్రమే పరిపాలించారని.. మిగతా సామాజిక వర్గాలు ఎందుకు పరిపాలించకూడదని ప్రశ్నించడం విజయసాయిరెడ్డి.. కేవలం రెడ్ల గురించి మాత్రమే పరిశోధన చేయడమేంటి.. పుస్తకం రాయడం ఏంటి.. పైగా పార్టీని ఏర్పాటు చేయబోతున్న ఈ సమయంలో దాని ప్రస్తావన ఎందుకుఆంధ్ర రాష్ట్రానికి దాదాపు 1500 టీఎంసీల నీళ్లు అవసరమని.. ప్రస్తుతం 1100 టిఎంసిల నీళ్లు మాత్రమే ఉన్నాయని విజయసాయిరెడ్డి చెప్పారు. ఆయన ఆవేదనలో అర్థం ఉంది. కానీ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెంబర్ 2 స్థానంలో ఉన్న విజయసాయిరెడ్డి ఏం చేశారు.. అప్పట్లో పార్టీని సజ్జల రామకృష్ణారెడ్డి హైజాక్ చేయలేదు కదా. అప్పుడు విజయసాయిరెడ్డి ఎంత చెబితే జగన్ కు అంత కదా.. అప్పుడు విజయసాయి రెడ్డి ఏం చేశారు.. ఇప్పుడు ప్రాధాన్యం తగ్గింది.. అందువల్లే ఏపీ ప్రయోజనాలు విజయ సాయి రెడ్డికి గుర్తుకు వచ్చాయి. దసరా దాకా పార్టీ ఏర్పాటును విజయసాయిరెడ్డి సస్పెన్స్ లో పెట్టారు.. కానీ ఇప్పటికీ ఏపీలో పరిస్థితి టిడిపి కూటమి వర్సెస్ వైఎస్ఆర్సిపి అన్నట్టుగానే ఉంది. అప్పట్లో షర్మిల పార్టీ పెట్టినప్పటికీ పెద్దగా సత్తా చూపించిన దాఖలాలు లేవు. విజయసాయిరెడ్డి చెప్పినట్టుగా వచ్చే ఎన్నికల్లో రాజకీయ శూన్యత.. రాజకీయ అనివార్యత ఏపీ రాష్ట్ర రాజకీయాలలో కనిపిస్తుంది అంటే.. నమ్మశక్యంగా లేదు.

# ఫింఛన్ల పండుగకు బృహత్తర అడుగు

ఒంగోలు సెప్టెంబర్ 8,ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి మరో బృహత్తర అడుగు వేసింది. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా దేశంలోనే అత్యధికంగా 62 లక్షల మందికి ప్రతి నెలా ఒకటో తేదీనే సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ పేదల పండుగ ను నిర్వహిస్తున్న ప్రభుత్వం, తాజాగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాన్ని విస్తరించాలని నిర్ణయించింది. సాంకేతిక , ఇతర కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు , ఇతర వృత్తుల వారికోసం సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో అందుబాటులో ఉండే నిర్దేశిత ఫారాల ద్వారా అర్హులందరూ తమ పత్రాలను సమర్పించవచ్చని అధికార యంత్రాంగం వెల్లడించింది.అర్హుల ఎంపికలో ఎలాంటి జాప్యానికి, అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వం అత్యంత పారదర్శకమైన, స్పష్టమైన సమయ పట్టికను ఖరారు చేసింది. సెప్టెంబర్ 7?16 మధ్య ఈ–కేవైసీ, ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యాక, సెప్టెంబర్ 17?21 వరకు సాధారణ అర్హత పరిశీలన చేపడతారు. అనంతరం సెప్టెంబర్ 22?24 తేదీలలో భౌతిక , శాఖాపరమైన క్షేత్రస్థాయి ధృవీకరణ పూర్తి చేసి, సెప్టెంబర్ 25?26 తేదీల్లో సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపుతారు. ఈ ప్రక్రియ ముగిశాక అర్హులైన అందరికీ దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేయనున్నారు. వివిధ కేటగిరీలకు అవసరమైన ఆధార్, రైస్ కార్డ్, సదరమ్ , ఆయా సంబంధిత శాఖల ధృవపత్రాలను జతచేసి అక్నాలెడ్జ్‌మెంట్ పొందే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు.ప్రస్తుతం ప్రతి నెలా రూ.2,694 కోట్ల వ్యయంతో జనాభాలో 12.88 శాతం మందికి నెలకు రూ.4,000 నుంచి గరిష్టంగా రూ.15,000 వరకు భరోసా అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2026 సెప్టెంబర్ 1 వరకు కేవలం పింఛన్ల కోసమే ఏకంగా రూ.73,508 కోట్లు ఖర్చు చేయడం, సంక్షేమం పట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. వృద్ధులు, దివ్యాంగులతో పాటు చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, ఒంటరి మహిళలు సహా దాదాపు 28 రకాల ప్రత్యేక కేటగిరీలకు పింఛన్లు ఇస్తూ ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నారు.గతంలో పింఛను పొందాలంటే సచివాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, ఊహాజనిత కారణాలతో కోతలు విధించడం వంటి పరిణామాలు ఉండేవి. అయితే, ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రమాణంగా ముందుకు సాగుతోంది. కొత్త దరఖాస్తుల స్వీకరణ ద్వారా క్షేత్రస్థాయిలో అసలైన నిరుపేదలకు, బాధితులకు 100 శాతం సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది.కొత్త ఫించన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ఏపీ సర్కార్ శుభవార్త చెప్పింది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఫించన్లు అందించేందు సిద్ధమైంది. ఈమేరకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. నేటి నుంచి వారం రోజుల పాటు గ్రామ వార్డు, సచివాలయాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను తీసుకోనుంది. మీ ఈ ఫించన్ ఎవరికి వస్తుంది. దీనికి అర్హులు ఎవరి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి, లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. నేటి నుంచి వారం రోజుల పాటు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వంలో జారీ చేసిన జీవో 174 ప్రకారమే లబ్ధిదారుల అర్హతను గుర్తించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తున్నలు పూర్తిగా పరిశీలించి అర్హులైన వారికి కేటగిరీల వారీగా ఫించన్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపింది. ఈ దరఖాస్తు ప్రక్రియను నేటి నుంచి స్టార్ట్ చేసి 20 రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత అర్హులైన వారికి వచ్చే నెల ఒకటి నుంచి ఫించన్లు అందించనున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ దరఖాస్తు ప్రక్రియ కొనసాగనున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే ఔఊచి వెబ్‌సైట్, ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు తమ దరఖాస్తు పత్రాన్ని సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శికి ఇవ్వాలి.. అతను మీ అప్లికేసన్‌లో అన్‌లైన్‌లో ఎంట్రీ చేసి తర్వాత మీరు మళ్లీ ఓ రసీదు ఇస్తారు. తర్వాత మీ అప్లికేషన్లోని వివరాలను ఈకేవైసీ డేటాతో మ్యాచ్ అయితే మీ అప్లికేషన్ తర్వాత దశకు వెళ్తోంది. అలేదంటే మీ దరఖాస్తున్న ఉన్న సమస్యను తెలియజేసి సరైన డాక్యుమెంట్స్‌ను మళ్లీ సబ్‌మిట్ చేయాలని చెప్తారు.

మీరు ఫించన్‌ను అప్ల చేయాలంటే కావాల్సిన పత్రాలు

ఆధార్, రేషన్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్

వితంతు ఫించన్ కోసమైతే.. లబ్ధిదారు భర్త డెత్ సర్టిఫికెట్, భర్త ఆధార్ కార్డు ఉండాలి

ఒంటరి మహిళ పింఛను కోసమైతే పెళ్లైన వారికి కోర్టు జారీ చేసి విడాకుల పత్రం ఉండాలి,

పెళ్లికాని వారికి మ్యారేజ్ అవ్వనట్టు ఓఖీూ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం కావాలి.

దివ్యాంగుల పింఛను కోసం అయితే.. 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న సదరమ్ సర్టిఫికెట్ కావాలి.

హిజ్రాల పింఛన్ కోసం జిల్లా మెడికల్ బోర్డు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం అవసరం

# లారీ లోమంటలు ..డ్రైవర్, క్లీనర్ సజీవ దహనం

కడప,కడప జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. రాయచోటి ఘాట్ లో సిమెంట్ లారీ బోల్తా పడడంతో మంటలు చెలరేగాయి. ఘటనలో డ్రైవర్, క్లీనర్ సజీవ దహనం అయ్యారు. సిమెంట్ లారీ రాయచోటి నుంచి కడపకు వస్తున్నప్పుడు ప్రమాదం జరిగింది. కడప, అన్నమయ్య జిల్లా బార్డర్ లో ఎడమవైపు మలుపు తిరగకుండా నేరుగా అడవిలోకి లారీ దూసుకెళ్లింది. అగ్ని ప్రమాదం ఎక్కువ కావడంతో అడవికి నిప్పు సెగలు అంటుకున్నాయి. అటవీ ప్రాంతంలో అగ్నిజ్వాలాలు ఎగసిపడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు.

# ప్రతిరోజూ రాత్రి 9 గంటలకు కరెంట్ కట్

- చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర అవస్థలు
- ప్రజా ప్రతినిధుల మౌనం

దేవీపట్నం , దేవీపట్నం మండలంలో గత కొంత కాలంగా విద్యుత్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ప్రతిరోజూ రాత్రి సరిగ్గా 9 గంటల సమయంలో కరెంట్ పోతోంది. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో కరెంటు పోవడంతో చిన్న పిల్లలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చీకటిలో పసిపిల్లలు భయంతో ఏడుస్తుండగా, వృద్ధులు ఉక్కపోతతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల చదువులకు కూడా ఆటంకం కలుగుతోంది.ఈ సమస్య గత కొంత కాలంగా కొనసాగుతున్నా, విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రజల కోసం పని చేయాల్సిన ప్రజా ప్రతినిధులు కూడా ఈ సమస్యను పరిష్కరించకుండా మౌనం పాటించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రాత్రి వేళల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

# తెనాలి రూరల్ పోలీసుల నిఘాతో భారీ గంజాయి విక్రయ, వినియోగ ముఠా గుట్టురట్టు

**9 మంది నిందితుల అరెస్ట్ ? 1.3 కేజీల గంజాయి స్వాధీనం**

గుంటూరు ,తెనాలి రూరల్ పోలీసుల సమర్థవంతమైన నిఘా, పక్కా సమాచార సేకరణతో అక్రమంగా గంజాయిని కొనుగోలు, విక్రయాలు మరియు వినియోగానికి పాల్పడుతున్న 9 మంది నిందితుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి వివిధ ప్యాకెట్లలో ఉన్న మొత్తం 1 కేజీ 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.తెనాలి డిప్యూటీ తహశీల్దార్ మరియు రెవెన్యూ అధికారుల సమక్షంలో పోలీసులు ఈ ప్రత్యేక దాడులు నిర్వహించారు.మొదటి దశ అరెస్ట్ ? నందివెలుగు జంక్షన్‌సోమవారం సాయంత్రం 6.0 గంటలకు, తెనాలి మండలంలోని నందివెలుగు జంక్షన్ వద్ద బ్రిడ్జి కింద గంజాయి విక్రయాలు, సేవనం జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ??ఈ సమాచారంతో తెనాలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ూఐ. నాయబ్ రసూల్, ఎస్.ఐ ఐ. ఆనంద్, తెనాలి డిప్యూటీ తహశీల్దార్ వీర్వోలు ఓఖూ ప్రసాద్, ఎఖీూలు గుంపెన నాగరాజు, కొత్త జార్జి థామస్ సమక్షంలో పోలీసులు దాడి నిర్వహించారు. దాడిలో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్న ం1 నుంచి ం5, ం8, ం9 వరకు మొత్తం 7 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ వరకు పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలపై సమగ్ర చర్చ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం

విజయవాడ,విజయవాడ డివి మేనర్ హోటల్ వేదికగా టీడీపీ జిల్లా పార్టీ ఎన్నికల సమావేశం జరిగింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. పార్లమెంటరీ పార్టీ ఎలక్షన్ ఇంచార్జ్ మక్కెన మల్లికార్జునరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు గద్దె అనురాధ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ బుద్దా వెంకన్నతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమావేశంలో పాల్గొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలు, కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన కార్యాచరణపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ఎన్నికల ప్రక్రియను పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్ణయించారు.

## శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా శ్రీ గాయత్రి మాతకు 151 చీరలతో అలంకరణ..



విభారె న్యూస్ సెప్టెంబర్ 8 ఎమ్మిగనూరు..స్థానిక గీతా నగర్లో వెలసిన శ్రీ వేద గాయత్రి దేవాలయంలో శ్రావణమాస చివరి మంగళవారం పురస్కరించుకొని శ్రీ వేద గాయత్రి మాత కు 151 చీరలతో అలంకరణ గావించారు. అలంకరణ గావించిన చీరలను గణపతి నవరాత్రుల తర్వాత భక్తులకు అందజేయడం జరుగుతుంది. గాయత్రి మాతను దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొన్నారు. అలంకరణ ఆలయ అర్చకులు బలకుంది నరహరి శాస్త్రి చే అలంకారం గావించబడినది.

## మహానందిలో నందీశ్వరాభిషేకం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 08 : శ్రావణ బహుళ త్రయోదశి సందర్భంగా మహానంది క్షేత్రంలో మంగళవారం మహాప్రదోషకాల నందీశ్వరాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గణపతి పూజ, పీఠార్చన, ఉపదేవతార్చన అనంతరం ప్రదోష సమయంలో నందీశ్వరునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మహాప్రదోషకాల అభిషేకాన్ని దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


## అర్హులందరికీ పింఛన్లు అందాలి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 8: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్ట 1, 2 స్వర్ణ వార్డుల్లో నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్, దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాలు, అర్హత ప్రమాణాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పింఛన్ కోసం వచ్చే వృద్ధులు, లబ్ధిదారులకు కుర్చీలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలనలో జాప్యం లేకుండా అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## కృత్రిమ మేధతో మోకాలి మార్పిడి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 08 : రాయలసీమలో తొలిసారిగా నంద్యాల జీఎస్ఆర్ ఆసుపత్రిలో కృత్రిమ మేధ, జర్మన్ సాంకేతిక సహకారంతో 70 ఏళ్ల మహిళకు మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డా. మహమ్మద్ రఫీ, డా. గుంటి శ్రీకాంత్ శస్త్రచికిత్స చేయగా, మత్తు వైద్యులు డా. మధుసూదన్ రెడ్డి పర్యవేక్షించారు. కృత్రిమ మేధ ఆధారిత రోబోటిక్ సహాయక విధానం ద్వారా శస్త్రచికిత్సలో కచ్చితత్వం, కీళ్లలో కృత్రిమ భాగాల అమరిక మెరుగుపడటంతో పాటు రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని డా. మహమ్మద్ రఫీ తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా కోలుకుంటున్నారని పేర్కొన్నారు. రాయలసీమలో ఈ తరహా అధునాతన శస్త్రచికిత్స తొలిసారిగా నిర్వహించడం విశేషమన్నారు. వైద్య బృందాన్ని ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా. రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డా. శ్రీనివాస్, డా. మధుసూదన రావు తదితర వైద్యులు అభినందించారు.



# జర్నలిస్టులపై కేసులు ఎత్తివేయాలి

### --సీపీఐ నాయకుల డిమాండ్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 08–: ఐన్యూస్ జర్నలిస్టులు సురేష్‌కుమార్, నాగచంద్రుడిపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగా నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లి జర్నలిస్టులను అరెస్టు చేయడం, వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. వార్తా కథనాలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చి వివరణ కోరాలి తప్ప, బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. జర్నలిస్టులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడాన్ని ఖండించారు. ఐన్యూస్ స్టాఫ్ రిపోర్టర్ బసవరాజుతో పాటు ఇతర విలేకరులను బెదిరించడం పత్రికా స్వేచ్ఛను, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీయడమేనన్నారు. తక్షణమే కేసులు ఉపసంహరించుకోకపోతే జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని రంగా నాయుడు హెచ్చరించారు.




## పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజల మద్దతు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 8: నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను తరలించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డులో టీడీపీ కార్యాలయానికి కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష ఐక్యవేదిక చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి మెయిన్ బజార్ వరకు పోస్టుకార్డు ప్రచారం నిర్వహించి ప్రజలకు సమస్యలను వివరించారు. ప్రజలు స్వచ్ఛందంగా పోస్టుకార్డులు రాసి ప్రధానికి పంపించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ.. 125 ఏళ్ల చరిత్ర కలిగిన వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని కాపాడాలని, కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలని కోరారు. రైతుల ప్రయోజనాల కోసం ఉన్న మార్కెట్ యార్డు స్థలాన్ని రాజకీయ పార్టీ కార్యాలయానికి కేటాయించడం సరికాదని అన్నారు. అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు ఏర్వ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఎజాస్, జానయ్య, శంకరయ్య, యర్రం శంకర్‌రెడ్డి, రాంబాబు, బాబాఫకృద్దీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## పోషణ్ మాసం 9 నుంచి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 8: జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ్ మాసం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ పీడీ లీలావతి దేవి, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. "మన అంగన్వాడీ?మన బాధ్యత" థీమ్‌తో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోప నివారణపై అవగాహన కల్పించాలన్నారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలతో వంటకాల ప్రదర్శనలు, ఆరోగ్య పరీక్షలు, చిన్నారుల ఎదుగుదల పర్యవేక్షణ, పోషణ మేళాలు నిర్వహించాలన్నారు. వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.



# సులోచన కోసం గాలింపు

తిరుపతి, సెప్టెంబర్ 8ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో 'లేడీ డాన్'గా పేరుపొందిన కోనేటి సులోచన నివాసంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కోట్ల రూపాయల విలువైన భూదందాలు, బెదిరింపులకు పాల్పడుతోందన్న ఆరోపణలతో పోలీసులు ఆమె ఇల్లు, ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంటిపై ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల సమయంలో సులోచన ఇంట్లో లేరని, ఆమె విజయవాడలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు నేతృత్వంలో మూడు పోలీసు బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. మార్పు వెంకటేశ్ నాయుడు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు, కోర్టు నుంచి పొందిన వారెంట్ ఆధారంగా ఈ దాడులు నిర్వహించారు. సులోచన ఇంటి నుంచి సుమారు 50 కీలక డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలు ఉన్నాయని భావిస్తున్న 15 బాండ్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఇవ్వకుండా ఈ దాడులను ఆకస్మికంగా నిర్వహించినట్లు పోలీసులు వివరించారు. స్వాధీనం చేసుకున్న పత్రాలను ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపించారు. ఒకప్పుడు వ్యవసాయ కూలీగా ఒకే గది ఇంట్లో నివసించిన సులోచన, అనతికాలంలోనే కోట్లకు పడగెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల అండదండలతో ఆమె అక్రమాలకు పాల్పడిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో భారీ ల్యాండ్ మాఫియా నడుపుతున్నట్లు ఆమెపై ప్రధాన ఆరోపణ. అవసరమైన వారికి అప్పులు ఇచ్చి, ఆ తర్వాత బెదిరింపులు, దౌర్జన్యాలతో వారి భూములను అన్యాయంగా రాయించుకుంటోందని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఆమె ఇంటి వద్ద బౌన్సర్లను కాపలాగా ఉంచి, బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెబుతున్నారు. పోలీసు రికార్డుల ప్రకారం, సులోచనపై ఇప్పటికే మదనపల్లె వన్ టౌన్, టూ టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్లలో కలిపి 14 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై రౌడీ షీట్ కూడా తెరిచారు. పోలీసుల దాడుల తర్వాత మరింత మంది బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నట్లు సమాచారం. బండిమీదకమ్మలపల్లెలో ఒక భవనం, 502 గజాల స్థలం (వీటి విలువ సుమారు రూ.60 కోట్లు), పొన్నుటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఆమె పేరు మీద ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 'లేడీ డాన్‌లు'గా పేరుపొందిన నిడిగుంట అరుణ, అరవ కామాక్షి తరహాలోనే సులోచన కూడా నేర సామ్రాజ్యాన్ని విస్తరించిందని స్థానికులు పోల్చుతున్నారు. కాగా, ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత ఫోర్జరీ ఆరోపణలపై మరింత స్పష్టత వస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

## 100 శాతం అక్షరాస్యతే లక్ష్యం---

### కలెక్టర్ జి.రాజకుమారి గణియా--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 08: జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది నిరక్షరాస్యులను గుర్తించామని, 'ఉల్లాస్–అక్షరాంధ్ర' కార్యక్రమం ద్వారా మూడేళ్లలో వారందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రెండో దశలో 1.12 లక్షల మందికి అక్షరాస్యత కల్పించడమే లక్ష్యమన్నారు. అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి మహిళలు సహా ప్రతి ఒక్కరికీ అక్షరజ్ఞానం అందించాలని సూచించారు. అక్షరాస్యతతో ఆత్మగౌరవం, సాధికారత పెరుగుతాయని పేర్కొన్నారు. "ప్రతి వ్యక్తి అక్షరాస్యుడు?ప్రతి కుటుంబం అక్షరాస్య కుటుంబం" అనే లక్ష్యంతో కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వయోజన విద్య డీడీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఓ జనార్దన్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ శివారెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, డీపీఓ ఫణికుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో గృహాల పరిశీలన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 08–: పట్టణంలోని టిడ్కో గృహాలను మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న మంగళవారం పరిశీలించారు. టిడ్కో గృహాల పరిసర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గృహాల చుట్టుపక్కల రహదారులు, పారిశుద్ధ్య పరిస్థితులు, మౌలిక వసతులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. టిడ్కో గృహాల వద్ద ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై కమిషనర్ దృష్టి సారించారు. గృహాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని పరిశీలన సందర్భంగా అధికారులు గుర్తించారు. పట్టణంలో మున్సిపల్ పరిధిలోని గృహ సముదాయాలు, పరిసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గిరిజనులకు 3 వార్డు సీట్లు కేటాయించాలి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 08–నంద్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 52 వార్డుల విభజనలో గిరిజనులకు రిజర్వేషన్ ప్రకారం మూడు వార్డు కౌన్సిలర్ స్థానాలు కేటాయించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగసారి సుంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గతంలో 32, 42 వార్డులు ఉన్న సమయంలోనూ గిరిజనులకు ఒక్క సీటుకే పరిమితం చేశారని, ఇప్పుడు 52 వార్డులు చేసిన నేపథ్యంలోనూ అదే విధానం కొనసాగిస్తే రాజకీయంగా గిరిజనులు హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. నంద్యాలలో 9 వేలకు పైగా గిరిజన ఓటర్లు ఉన్నందున జనాభా ప్రాతిపదికన మూడు వార్డు స్థానాలు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో అన్ని గిరిజన సంఘాలతో కలిసి తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**